సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 29 । ఏప్రిల్ । 2023



మక్కల కొనుగోళ్లకు సన్నాహాలు
ఉమ్మడి జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా మొక్క జొన్నల కొనుగోళ్లకు రంగం సిద్ధమవుతోంది. 31 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. IIలో



కరకట్టలు నిర్మించాలి
భద్రాచలం వద్ద గోదావరి నదికి ఇరువైపులా కరకట్ట నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. IIలో

గరిష్ఠం / కనిష్ఠం
37°/ 25°
వాతావరణం
జిల్లాలో శనివారం ఎండ తీవ్రత ఉండవచ్చు. మధ్యాహ్నం, రాత్రివేళ ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం వైభవంగా జరిపారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఈఓ ఎన్.రజనీకుమారి, పాలకవర్గ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు పాల్గొన్నారు.

రామయ్య ఆభరణాల ఆడిట్



మాజీ, ప్రస్తుత ఈఓల సమక్షంలో ఆడిటింగ్ చేస్తున్న అధికారులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని స్వామివార్ల బంగారు, వెండి ఆభరణాల ఆడిట్ శుక్రవారం ప్రారంభమైంది. దేవాదాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అసిస్టెంట్ కమిషనర్ అంజనీదేవి ఆధ్వర్యంలో ఆడిటింగ్ నిర్వహించారు. తొలిరోజు బ్యాంకులలో స్వామి వారికి ఉన్న బంగారు, వెండి ఇతర ఆభరణాల లెక్కలను సరి చూశారు. రామాలయ మాజీ ఈఓ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.శివాజీ ఈ ఆభరణాలను ప్రస్తుత ఈఓ ఎల్.రమాదేవికి అప్పగించే కార్యక్రమంలో భాగంగా మరో రెండు రోజులపాటు ఈ ఆడిట్ జరగనుంది. సీపీ అనిల్, దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెకేషన్ కోర్టులకు జడ్జిల నియామకం

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా కోర్టులకు మే 3వ తేదీ నుంచి 31 వరకు సెలవులు ఇవ్వనున్నారు. 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మొదటి విడతలో, మే 17వ తేదీ నుంచి 31 వరకు రెండో విడతలో సెలవులను ఇస్తున్నట్లు హైకోర్టు శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెలవుల్లో అత్యవసర పరిస్థితుల్లో కేసుల విచారణకు అందుబాటులో ఉండేలా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టుకు మే 3 నుంచి 16 వరకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి పాటిల్ వసంత్‌ను, మే 17 నుంచి 31 వరకు అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్యాంశ్రీలను నియమించారు.

రైతులకు ఉచిత న్యాయసహాయం

న్యాయమూర్తి ముఖేష్



మాట్లాడుతున్న న్యాయమూర్తి ముఖేష్

ఇల్లెందురూరల్: రైతులకు న్యాయపరమైన సందేహాలు నివృత్తి చేయడంతోపాటు ఉచితంగా సలహాలు అందించేందుకు గ్రామ స్థాయిలో వ్యవసాయ న్యాయ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్ తెలిపారు. మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీ రైతు వేదికలో వ్యవసాయ న్యాయ సహాయ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో మాట్లాడారు. రైతులకు వ్యవసాయ చట్టాలు, రైతు సంక్షేమ పథకాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం, రైతులకు చట్టబద్ధంగా అందాల్సిన ఫలాలు, రైతు సాధికారతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కేంద్రం పని చేస్తుందని అన్నారు. విత్తన చట్టం ప్రకారం ధ్రువీకరించిన కంపెనీ విత్తనాలను, పురుగు మందులను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని సూచించారు. ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి మరియన్న, ఏడీఏ వాసవీరాణి, ఏవో సతీష్, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు శ్యాంబాబు, మాధవరావు, జనగం కోటేశ్వరరావు, హనుమంతరావు, భావ్‌సింగ్, అశోక్, అన్నపూర్ణ, న్యాయవాదులు ఉమామహేశ్వరరావు, కార్తీక్, సూర్నపాక సత్యనారాయణ, పారాలీగల్ వలంటీర్ సతీష్ ఖండేల్‌వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈసారి పప్పులుడకలే..!



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి మెడికల్ బోర్డుపై ఉన్నతాధికారుల నజర్

- దళారులకు చెక్ పెట్టే యత్నంలో యాజమాన్యం
- కారుణ్య నియామకాల్లో అవకతవకలపై కఠిన చర్యలు
- సంస్థ ప్రధాన కార్యాలయం, ఆస్పత్రి వద్ద విజిలెన్స్ నిఘా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మెడికల్ బోర్డు నిర్వహిస్తున్నారంటే చాలు కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కంటే దళారుల హడావుడే ఎక్కువ అవుతోంది. మాయమాటలు చెప్పి లేనిపోని భయాలు సృష్టించి కార్మికుల నుంచి లక్షల రూపాయలు దోచుకునేందుకు దళారులు సిద్ధమవుతున్నారు. అయితే ఈసారి దళారుల ఆగడాలకు చెక్ పెట్టేందుకు సంస్థ ఉన్నతాధికారులు ప్రయత్నించారు.

కారుణ్య నియామకాల్లో 15 వేల మందికి ఉద్యోగాలు

తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యోగాల భర్తీ కోసం కేవలం రెండు సార్లే సింగరేణి నోటిఫికేషన్లు జారీ చేసి సుమారుగా 4,700ల మందికి ఉద్యోగాలు కల్పించింది. ఇదే సమయంలో సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా ఇప్పటివరకు ఇంచుమించు 15 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. అంటే రెగ్యులర్ కంటే కారుణ్యం కోటాలోనే అత్యధికంగా సింగరేణిలో ఉద్యోగాల భర్తీ జరుగుతోంది. నోటిఫికేషన్లతో పని లేకుండా సింగరేణి సంస్థలో ఉద్యోగం పొందేందుకు కారుణ్యం ద్వారా అవకాశం ఉండటంతో కల్లిబొల్లి కబుర్లు చెబుతూ, తిమ్మినిబమ్మి చేస్తూ దళారులు కార్మికుల శ్రమార్జితాన్ని దోచేస్తున్నారు. ఒక్క రూపాయి కూడా అక్రమ పద్ధతిలో చెల్లించకుండా వీరి వారసులకు ఉద్యోగాలు రావాల్సి ఉంది. కానీ, అన్ని అర్హతలు ఉన్నా దళారుల కారణంగా మెడికల్ బోర్డు ముందు హాజరయ్యే కార్మికుల్లో నూటికి తొంభై మంది రూ.6 లక్షల నుంచి రూ. 8 లక్షల వరకు దళారుల చేతులు తడిపితేనే పని జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. అలా చేయకుంటే తమ వారసులకు అన్యాయం జరుగుతుందేమో అనే భావన సంస్థ వ్యాప్తంగా ఉన్న కార్మికుల్లో నెలకొంది.

పారదర్శకత కోసం..

కారుణ్య నియామకాల ప్రక్రియలో అవినీతి జరుగుతోందంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో సంస్థలోని ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మెడికల్ బోర్డు జరిగే సమయంలో కార్మికులు, ఉద్యోగులు తప్ప మరెవరినీ సంస్థ ప్రధాన కార్యాలయం, ప్రధాన ఆస్పత్రి ప్రాంగణంలోకి అనుమతించడం లేదు. విజిలెన్స్ సిబ్బంది ప్రధాన ఆస్పత్రి మొదలు సింగరేణి ప్రధాన కార్యాలయం, మున్సిపాలిటీ ఆఫీసు వరకు ఎక్కడైనా దళారులు తిష్ట వేసుకుని ఉంటే, అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ సూచిస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మెడికల్ బోర్డు నిర్వహించే తీరులో పారదర్శకత తీసుకువచ్చేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు.

పలువురి గైర్హాజరు?

కారుణ్య నియామకాల్లో ఈసారి అవకతవకలకు ఆస్కారం ఇవ్వొద్దనే విధంగా కఠిన చర్యలు తీసుకోవడంతో దళారులు ఆటలు సాగే పరిస్థితి కనిపించలేదు. వివిధ ఏరియాల నుంచి మెడికల్ బోర్డులకు వచ్చే కార్మికుల కోసం ఇక్కడున్న హోటళ్లలో ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. కార్మికులు వచ్చిరాగానే వారి దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూ జరిగే తీరు, అక్కడ వ్యవహరించాల్సిన పద్ధతులు అంటూ లేనిపోని హడావుడి సృష్టించినట్టు తెలుస్తోంది. ఏ చిన్న తేడా వచ్చినా మీ వారసులకు ఉద్యోగాలు రావంటూ భయపెట్టారు. మరోవైపు ఫోన్ల ద్వారా తమ వారి పనులు పనులు చక్కబెట్టుకునేందుకు ప్రయత్నించినా వారికి సానుకూల ఫలితాలు రానట్టు తెలుస్తోంది. దీంతో ఈ సారి మెడికల్ బోర్డు ముందుకు వెళ్లడం కంటే గైర్హాజరు అవడమే మంచిదనే అభిప్రాయం ఏర్పడింది. ఫలితంగా ఈసారి దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మంది గైర్హాజరైనట్టు సమాచారం. బోర్డు నిర్వహణలో కఠిన చర్యలు తీసుకున్నట్టుగానే సింగరేణి వ్యాప్తంగా ఉన్న గనుల దగ్గర సైతం కార్మికుల్లో అవగాహన పెరిగేలా చర్యలు చేపట్టాలని కార్మికులు సంస్థ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

వారసత్వం పోయి..

యాజమాన్యంతో కార్మిక సంఘాలు కొట్లాడి వారతస్వ ఉద్యోగాలు దక్కించుకున్నాయి. కొంతకాలం ఈ విధానం సింగరేణిలో నిలిచిపోగా, తెలంగాణ ఉద్యమ సమయంలో మళ్లీ తెర మీదకు వచ్చింది. న్యాయపరమైన అడ్డంకులు ఉండటంతో వారసత్వ ఉద్యోగాల హక్కును తిరిగి కల్పించడం వీలుకాలేదు. ఈ క్రమంలో అనారోగ్య కారణాలతో ఎవరైనా కార్మికుడు అన్‌ఫిట్ అయితే వారి కుటుంబ సభ్యుడు (కొడుకు/అల్లుడు)లకు ఉద్యోగం కల్పించే హక్కు కారుణ్య నియామకం పేరుతో యథావిధిగా కొనసాగుతూ వస్తోంది.

కఠిన చర్యలు తీసుకుంటున్నాం



కారుణ్య నియామాల్లో ఎలాంటి అవకతవకలకూ ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. మెడికల్ బోర్డు జరిగే సమయంలో విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ మరింత అప్రమత్తంగా వ్యవహరించేలా మార్పులు తెచ్చాం. ఎవరైనా రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

–ఎస్.బలరాం, సింగరేణి డైరెక్టర్ (పా)

జేపీఎస్‌ల సమ్మెబాట..



సమ్మెలో పాల్గొన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

- ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట దీక్షలు
- ఉద్యోగాల రెగ్యులరైజేషనే ప్రధాన డిమాండ్
- గ్రామాల్లో గాడి తప్పనున్న పాలన

చుంచుపల్లి: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, ఇప్పటివరకు చేసిన నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ను సర్వీస్ కాలంగా గుర్తించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం నుంచి సమ్మెలోకి దిగారు. సమ్మెకు ముందు నాలుగైదు రోజులుగా జేపీఎస్‌లు సహాయ నిరాకరణ చేపట్టిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం వీరి డిమాండ్ల విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో విధులను బహిష్కరించి సమ్మె బాట పట్టారు. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న 353 మంది జేపీఎస్‌లు, 24 మంది ఓపీఎస్‌లు కలెక్టరేట్ బయట ఏర్పాటు చేసిన ప్రత్యేక టెంట్‌లో నిరసన చేపట్టారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, జేపీఎస్‌లు, ఓపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని ప్లకార్డులు చేబూని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు జేపీఎస్‌లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను ప్రగతి బాట పట్టించడంలో నాలుగేళ్లుగా నిరంతరం కృషి చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు వంశీ కృష్ణ, పలు మండలాలకు చెందిన జేపీఎస్‌ల సంఘం అధ్యక్షులు సతీష్, సంపత్, ప్రశాంత్, పాషా, సాయి, విజయ్, చరిత్, రాణదీర్, ఉదయ్, నర్మదా, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

2019లో నియామకం

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఏప్రిల్ 12, 2019న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్)లను నియమించింది. ఏప్రిల్ 11, 2022కు మూడేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తికాగా, ఆ తర్వాత సుమారు రూ.15వేల వరకు వేతనం పెంచి మరో ఏడాది ప్రొబేషనరీ కాలాన్ని పొడిగించింది. ప్రస్తుతం జేపీఎస్‌కు నెలకు రూ. 28,712 వేతనం అందుతుండగా, నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం ఈ నెల 11వ తేదీతో ముగిసింది. ఈ క్రమంలో రెగ్యులరైజేషన్ కోసం డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టినా, 15రోజులపాటు వేచి చూసినా ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. దీంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 27న సమ్మె నోటీస్ ఇచ్చి, శుక్రవారం నుంచి సమ్మెకు దిగారు. ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట నిరాహార దీక్షలు మొదలుపెట్టారు.

పాలనలో కీలకం

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పాలనలో కీలకంగా ఉన్నారు. 2019లో విధుల్లో చేరగా… తొలిరోజుల్లో పల్లెప్రగతి కార్యక్రమం, ఆ తర్వాత ట్రాక్టర్ల కొనుగోళ్లు, పారిశుద్ధ్య పనులు, హరితహారం, పలెల్ ప్రపకృతి వనాలు, స్ట్రీట్‌లైట్, గ్రామ పంచాయతీల నర్సరీల పర్యవేక్షణ, 2020వ ఏడాదిలో కరోనా కాలంలో సేవలు, కోవిడ్ వ్యాక్సినేషన్.. ఇలా ఒకటి కాదు… రెండు కాదు విధుల్లో చేరిన నాటి నుంచి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి పనినీ పంచాయతీ కార్యదర్శులే నిర్వహించాల్సివస్తోంది. ఈ నేపథ్యంలో వారు సమ్మెలోకి వెళ్లగా పంచాయతీల పాలన గాడి తప్పేలా ఉంది. ఒక్కో పంచాయతీకి కనీసం ముగ్గురు మల్టీపర్పస్ వర్కర్లు ఉన్నారు. వారిపై అజమాయిషీ లేక అనేక సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు.

డిమాండ్లు ఇవే..

- జేపీఎస్‌లను రెగ్యులర్ చేస్తూ జీఓ విడుదల చేయాలి. నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్‌గా గుర్తించాలి.
- ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేయాలి. పని చేసిన కాలాన్ని ప్రొబేషనరీ పీరియడ్‌గా పరిగణించి, వారిని కూడా రెగ్యులరైజ్ చేయాలి.
- పంచాయతీ కార్యదర్శుల కేడర్ స్ట్రెంత్‌ని నిర్ధారించి ప్రకటించాలి.
- మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియమకాలు చేపట్టాలి.
- అర్హులైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించాలి.
- 317 జీఓతో నష్టపోయినవారికి న్యాయం చేయాలి. పరస్పర బదిలీలు, స్పౌస్ బదిలీలకు అవకాశం కల్పించాలి.

రెగ్యులర్ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు దిగిన నేపథ్యంలో వారి స్థానంలో గ్రామపంచాయతీల బాధ్యతలను ప్రభుత్వం సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు అప్పగించింది. జిల్లాలో 104 మంది రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ అదనంగా ఒకటి, రెండు చొప్పున గ్రామ పంచాయతీలను చూసే బాధ్యతలు అప్పగించారు. పూర్తిగా జేపీఎస్‌లు పరిశీలించే చోట ఆ గ్రామ పంచాయతీల బాధ్యతలను ఆ మండలానికే చెందిన ఎంపీడీవో, ఎంపీఓ, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు బదలాయించారు. వీరు కూడా ఒక్కొక్కరు రెండు లేదా మూడు చొప్పున గ్రామ పంచాయతీల బాధ్యతలను సమ్మె కాలం వరకు చూడాలని ఆదేశించారు. శనివారం నుంచి వీరందరూ గ్రామ పంచాయతీల పాలనపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయనున్నారు. సమ్మె నేపథ్యంలో పల్లె ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు డీపీఓ రమాకాంత్ తెలిపారు.

రామయ్యకు పుష్యమి పట్టాభిషేకం

స్వర్ణకవచధారణలో దర్శనమిచ్చిన స్వామివారు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామివారికి శుక్రవారం పుష్యమి నక్షత్రంను పురస్కరించుకుని పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా అంతరాలయంలో మూలమూర్తులను స్వర్ణకవచాలతో అలంకరించారు. సువర్ణపు తేజస్సుతో వెలిగిన శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన స్వామి వార్లను భక్తులు పరవశంతో దర్శించుకున్నారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, అరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం స్వామి వారికి పట్టాభిషేక క్రతువును వైభవంగా జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.



పట్టాభిషేక మహోత్సవ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

బీసీలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్

మణుగూరుటౌన్: రాష్ట్రంలో బీసీలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మణుగూరు స్నేహా గార్డెన్‌లో నిర్వహించిన పినపాక నియోజకవర్గ ఓబీసీ మోర్చా సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ ఓట్లతో గద్దెనెక్కిన కేసీఆర్ ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందన్నారు. నాయకులు మెరుగు రవీందర్, పున్నం బిక్షపతి, శ్రీనివాస్‌గౌడ్, నాగేంద్రప్రసాద్, ముస్కు శ్రీనివాసరెడ్డి, మీసాల దుర్గారావు, బాల నర్సింహారావు, వెంకటేశ్వర్లు, దంతలూరి రామచంద్రరాజు, నాగబాబు పాల్గొన్నారు.

16 మంది ఎంపీడీఓలు బదిలీ

చుంచుపల్లి: జిల్లాలో పలువురు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం కలెక్టర్ అనుదీప్ ఆదేశాలు జారీ చేశారు. పరిపాలన పరమైన బదిలీల్లో భాగంగా ప్రజల సౌలభ్యం కోసం ఈ బదిలీలను చేపట్టారు. సుదీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న పలువురు ఎంపీడీఓలకు స్థానచలనం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 21 మండలాలు ఉండగా 16 మంది మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులకు స్థానచలనం కల్పిస్తూ బదిలీ అయిన స్థానాల్లో తక్షణమే రిపోర్టు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో గుండాల, జూలూరుపాడు, సుజాతనగర్, బూర్గంపాడు, అశ్వాపురం మండలాలకు చెందిన ఎంపీడీవోలు మినహా మిగతా వారికి ఈ బదిలీల్లో అవకాశం కల్పించారు.

ఎంపీడీఓ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.మంగమ్మ	ఆళ్లపల్లి	చుంచుపల్లి
ఎస్.రమేష్	చుంచుపల్లి	లక్ష్మీదేవిపల్లి
ఎం.రామారావు	లక్ష్మీదేవిపల్లి	ఆళ్లపల్లి
డి.అన్నపూర్ణ	చంద్రుగొండ	అన్నపురెడ్డిపల్లి
జి.రేవతి	అన్నపురెడ్డిపల్లి	చంద్రుగొండ
బి.శంకర్	సస్పెన్షన్	కరకగూడెం
డి.శ్రీను	కరకగూడెం	ములకలపల్లి
ఆర్.సీహెచ్ నాగేశ్వరరావు	ములకలపల్లి	దమ్మపేట
డి.చంద్రశేఖర్	దమ్మపేట	పినపాక
ఎం.చంద్రమౌళి	దుమ్ముగూడెం	మణుగూరు
కె.వీరబాబు	మణుగూరు	టేకులపల్లి
డి.బాలరాజు	టేకులపల్లి	ఇల్లెందు
బి.అప్పారావు	ఇల్లెందు	పాల్వంచ
జి.రవీంద్రప్రసాద్	పాల్వంచ	చర్ల
జి.శ్రీనివాసరావు	వెయిటింగ్	అశ్వారావుపేట
జి.ముత్యాలరావు	దుమ్ముగూడెం(ఎంపీఓ)	దుమ్ముగూడెం

జిల్లా జడ్జిని కలిసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్

కొత్తగూడెంటౌన్: జిల్లా ప్రధాన్య న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన పాటిల్‌వసంత్‌ను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.జానయ్య శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు ఎస్‌కే.రెహమాన్ అలీ, ఆర్.వెంకటేశ్వర్లు, ఎల్.రాజు, అబ్బయ్య, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జడ్జి వసంత్‌ను కలిసిన ఎక్సైజ్, పోలీస్ అధికారులు

రేపటి వరకే 'ఎర్లీ బర్డ్' గడువు

- ముగింపు దశకు చేరిన స్కీం
- ఈనెల 30లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ
- ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో రూ.10.26 కోట్ల వసూలు



ఖమ్మంలో పన్నుల వసూళ్లను పరిశీలిస్తున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లి టౌన్: నగర, పుర పాలక సంస్థల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం ఏటా ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్‌లో ఎర్లీ బర్డ్ స్కీంను అమలుచేస్తోంది. ఈనెలలో ఆస్తి పన్ను పూర్తిగా చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ వర్తింపచేస్తున్నారు. ఈనెల 30వ తేదీతో ఈ స్కీం ముగియనుండగా అందరూ పన్ను చెల్లించేలా అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మధిర, వైరా, సత్తుపల్లి, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, కొత్తగూడెం మున్సిపాలిటీల్లో శుక్రవారం నాటికి 19,174 మంది రూ.10,26,10,000 పన్నులు చెల్లించారు.

ఖమ్మం ముందంజ..

ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ఐదు శాతం రాయితీతో పన్నులు చెల్లించే గడువు ఆదివారంతో ముగియనుంది. ఈ నేపథ్యాన వీలైనంత వరకు పన్నులు వసూలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలతో పోలిస్తే ఖమ్మం కార్పొరేషన్ ఈ స్కీం ద్వారా పన్నులు రాబట్టడంలో విజయం సాధించిందేనని చెప్పాలి. శని, ఆదివారాలు అవకాశమున్నందున మిగతా పన్నులు రాబట్టేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నిరంతరం పర్యవేక్షణ

కేఎంసీ పరిధిలో ఆస్తి పన్నులు వసూలు చేసేందుకు అధికారులు ఏప్రిల్ మొదటి వారం నుండి ప్రత్యేక కార్యాచరణ అమలుచేశారు. చేపట్టారు. రెవెన్యూ వార్డుల వారీగా ప్రత్యేక అధికారులను కేటాయించి నిరంతరం కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి సమీక్షిస్తున్నారు. పెద్ద మొత్తంలో పన్ను చెల్లించే వారి వద్దకు కమిషనర్ నేరుగా వెళ్లి స్కీం ప్రయోజనాలను వివరించడంతో ఈ స్కీం ద్వారా రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం సాధించిన కార్పొరేషన్‌గా ఖమ్మం నిలిచింది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు 10,210 మంది రూ.7.10 కోట్లు ఆస్తి పన్ను చెల్లించారు. మిగిలిన రెండు రోజుల్లో ఇంకా రూ.2 కోట్ల మేర వసూలయ్యే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

అపోహలు విడనాడేలా…

అసలే ఎన్నికల ఏడాది.. పన్నుల చెల్లింపుపై ఇంకా రాయితీ ఉంటుందేమోననే అపోహతో పలువురు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. కరోనా సమయంలో రూ.10వేలలోపు ఆస్తిపన్నుపై ప్రభుత్వం 50శాతం రాయితీ ఇవ్వడంతో అలాగే జరగొచ్చనే భావనలో ఉన్నట్లు సమాచారం. దీంతో మున్సిపల్ ఉద్యోగులు పెద్దమొత్తంలో పన్ను చెల్లించాల్సి ఉన్న వారి వద్దకు నేరుగా వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. అలాగే, ఆటోలకు మైకులు ఏర్పాటు చేసి వీధుల్లో ప్రచారం చేస్తున్నారు.

కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో 'ఎర్లీ బర్డ్' ద్వారా సమకూరిన ఆదాయం

కార్పొరేషన్/ మున్సిపాలిటీ	చెల్లింపుదారులు	ఆదాయం (రూ.ల్లో)
ఖమ్మం	10,120	7.10 కోట్లు
మధిర	1,350	37 లక్షలు
వైరా	700	29 లక్షలు
సత్తుపల్లి	1,290	69 లక్షలు
ఇల్లెందు	860	25 లక్షలు
పాల్వంచ	2,179	67 లక్షలు
మణుగూరు	890	29 లక్షలు
కొత్తగూడెం	1,785	60.10 లక్షలు

క్లుప్తంగా

2న బీఆర్‌ఎస్‌ యువజన విభాగం సమావేశం

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా కార్యాలయంలో వచ్చేనెల 2వ తేదీన పార్టీ యువజన విభాగం జిల్లా సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు చెందిన బీఆర్‌ఎస్‌ యువజన అధ్యక్షులు, మండల యువజన విభాగం అధ్యక్షులు, వివిధ హోదాలలో ఉన్న యువజన విభాగం నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పాల్వంచలో ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ తనిఖీలు



కిరాణా షాపులో తనిఖీ చేస్తున్న కిరణ్‌కుమార్‌

పాల్వంచ: పాల్వంచ పట్టణంలో ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ కిరణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో శుక్రవారం పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మూడు షాపుల్లో శాంపిళ్లు సేకరించి.. వాటిని ల్యాబ్‌కు పంపించనున్నారు. కాగా, వర్తక సంఘం కన్వీనర్‌ చలవాది ప్రకాశ్‌తోపాటు మరి కొందరు.. అధికారులు దాడులు చేస్తున్న కిరాణా దుకాణాల వద్దకు వెళ్లి ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో వెలిసిన కార్పొరేట్‌ స్థాయి షాపింగ్‌ మాల్‌లలో ఎలాంటి తనిఖీలు చేయడం లేదని, కేవలం మార్కెట్‌ ఏరియా వ్యాపారుల వద్దే తనిఖీ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ మాట్లాడుతూ ఏదైనా ఫిర్యాదు ఉంటే తమకు లిఖిత పూర్వకంగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి


అశ్వాపురం: మణుగూరు మండలం తిర్లాపురం గ్రామ సమీపంలో ఈ నెల 26న అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అశ్వాపురం మండలం బట్టిలగుంపు గ్రామ పంచాయతీ పరిధి మారుమూల గ్రామమైన రాంనగర్‌కు చెందిన మడివి రమేశ్‌ (36) భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రమేశ్‌ తన తండ్రితో కలిసి బైక్‌పై బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రమేశ్‌ తండ్రి మంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన రమేశ్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండు రోజుల వ్యవధిలో తండ్రి, కొడుకులు మృతి చెందడంతో వలస ఆదివాసీ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి

అశ్వారావుపేటరూరల్‌: మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదని ఓ వృద్ధుడు పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ రాజేశ్‌కుమార్‌ కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడెం గ్రామ పంచాయతీ బండిసుబ్రహ్మణ్యంనగర్‌కు చెందిన బొల్లి కృష్ణ (75) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 25వ తేదీన మద్యం తాగేందుకు తన కుమార్తె అనితను రూ.200 అడిగాడు. ఆమె డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించి, మద్యం తాగొద్దని చెప్పింది. దాంతో మనస్తాపం చెందిన వృద్ధుడు ఇంట్లోనే పురుగులమందు సేవించాడు. గమనించిన కుటుంబీకులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తుండగా పరిస్థితి గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. శుక్రవారం మృతుడి కుమార్తె అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


జియోటవర్‌కు నిప్పంటించి ఇన్‌ఫార్మర్లకు హెచ్చరిక



మావోయిస్టులు ఏర్పాటు చేసిన బ్యానర్‌

చర్ల: దంతెవాడ జిల్లాలో మావోయిస్టులు మారోమారు విధ్వంసానికి దిగారు. మందుపాతర పేల్చి పది మంది డీఆర్‌జీ జవాన్లతో పాటు ఒక డ్రైవర్‌ను మట్టుబెట్టి సరిగ్గా రెండు రోజులు కూడా గడవక ముందే మళ్లీ అదే జిల్లాలో పోలీస్‌ స్టేషన్‌కు సమీపంలోనే ఉన్న జియోటవర్‌కు నిప్పంటించి దహనం చేయడంతో పాటు ఇన్‌ఫార్మర్లను హెచ్చరిస్తూ బ్యానర్లు కట్టారు. ఈ ఘటన దంతెవాడ జిల్లాలోని మాలేవాహి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని చోటుచేసుకుంది. బార్సూర్‌కు సమీపంలోని జియో టవర్‌ వద్దకు చేరుకున్న మావోయిస్టులు కంట్రోల్‌రూంకు నిప్పంటించారు. అనంతరం ఆ ప్రాంతంలో ఒక బ్యానర్‌ను కట్టారు. ఈ బ్యానర్‌లో పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్న వారు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, దీనిని గుర్తించి నడుచుకోవాలని హెచ్చరించారు.

పామాయిల్‌ గెలలు



టన్ను ధర	రూ.13,943

మక్కల కొనుగోళ్లకు సన్నాహాలు

ఉమ్మడి జిల్లాలో 31 కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు

- 70 వేల మెట్రిక్‌ టన్నుల సేకరణకు ప్రణాళిక
- ప్రభుత్వ ఆదేశాలతో అధికారులతో సమీక్షించిన కలెక్టర్లు
- రవాణా, గోదాముల అంశాలపై పరిశీలన



ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం చిరుమర్రిలో కల్లాల్లో కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో మార్క్‌ఫెడ్‌ ద్వారా మొక్కజొన్నల కొనుగోళ్లకు రంగం సిద్ధమవుతోంది. అకాల వర్షాలతో మొక్కజొన్న పంట దెబ్బతినడం, మిగిలిన పంటనైనా అమ్ముకుందామనుకుంటే దళారులు ధర తగ్గిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. మొక్కజొన్న విస్తారంగా సాగయ్యే జిల్లాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా మొదటిస్థానంలో ఉంటుంది. జలాశయాల్లో సమృద్ధిగా నీరు ఉండటంతో ఖమ్మం జిల్లాలో 91,225 ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 28,290 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. అయితే, పంట చేతికందే దశలో గతనెల వచ్చిన ఈదురుగాలులు, వడగండ్ల వానతో పంట నేలవాలింది. చేతికందే దశలో ఉన్న కంకి నాణ్యత కోల్పోగా.. కోత కూడా ఇబ్బందిగా మారింది. యంత్రాలతో కోయాల్సిన పంటను కూలీలతో కోయించడంతో రైతులపై అదనపు భారం పడింది. వర్షాలతో పంట నాణ్యత తగ్గడం, మార్క్‌ఫెడ్‌ రంగంలోకి దిగకపోవడాన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు సిండికేట్‌గా మారారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం మక్కలకు క్వింటాకు రూ.1,962 మద్దతుగా ధర నిర్ణయించినా వ్యాపారులు రూ.1,600 నుంచి రూ.1,700కు మించి ధర చెల్లించడం లేదు. ఈ నేపథ్యాన సీఎం కేసీఆర్‌ ఆదేశాలతో మార్క్‌ఫెడ్‌ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనుండడం రైతులకు ఊరట కలిగించనుంది.

రవాణా, గోదాముల లభ్యతపై ఆరా

కొనుగోలు కేంద్రాల్లో సేకరించే మక్కలను రవాణా చేయడం, ఆపై నిల్వకు గోదాంలను గుర్తించడంపై మార్క్‌ఫెడ్‌ దృష్టి సారించింది. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో వ్యవసాయ మార్కెట్లకు చెందిన 25 వేల మెట్రిక్‌ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 20 వేల మెట్రిక్‌ టన్నుల గోదాములను గుర్తించారు. అలాగే, రవాణా కోసం లారీల సేకరణకు టెండర్లు నిర్వహించాల్సి ఉండగా.. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలైతే ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యాన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు మార్క్‌ఫెడ్‌ అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. కేంద్రాల ఏర్పాటు, రవాణా, గోదాముల లభ్యతపై ఆరా తీసిన కలెక్టర్లు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొనుగోళ్లకు సిద్ధం కావాలని ఆదేశించారు.

31 కేంద్రాలు.. 70 వేల మెట్రిక్‌ టన్నులు



ఖమ్మం జిల్లా బోనకల్‌ మండలం ముష్టికుంట్లలో ఆరబోసిన మొక్కజొన్న

మొక్కజొన్న పంట విస్తారంగా సాగైన ఖమ్మం జిల్లాలో 21, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పది కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్క్‌ఫెడ్‌ ప్రాథమికంగా నిర్ణయించింది. పంట ఎక్కువగా సాగైన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేసి నిబంధనల ప్రకారం కొనుగోళ్లు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రభుత్వం అనుమతిస్తే కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచే అవకాశం ఉందని సమాచారం. ఇక రెండు జిల్లాల్లో కలిపి 70 వేల మెట్రిక్‌ టన్నుల మక్కలు కొనుగోలు చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించారు. ఖమ్మం జిల్లాలో 50 వేల మెట్రిక్‌ టన్నులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 20 వేల మెట్రిక్‌ టన్నుల మొక్కజొన్నలు సేకరించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం..



ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మొక్కజొన్న కొనుగోళ్లకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే వాటిని అనుసరించి చర్యలు వేగవంతం చేస్తాం. పంట సాగు చేసిన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఉంటుంది. గోదాములు, రవాణా తదితర అంశాలపై దృష్టి సారించాం. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.1,962తో మక్కలు కొనుగోలు చేస్తాం.

– ఎం.సునీత, మార్క్‌ఫెడ్‌ మేనేజర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

శానిటేషన్‌ రిసోర్స్‌ పార్కు ప్రారంభం

- ట్రయల్‌ రన్‌ విజయవంతం
- హర్షం వ్యక్తం చేసిన మున్సిపల్‌ ఛైర్మన్, కమిషనర్‌



శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్‌ ఛైర్మన్‌ డీవీ, కమిషనర్‌ అంకుషావలి

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో శానిటేషన్‌ రిసోర్స్‌ పార్క్‌ (పారిశుద్ధ్య వనరుల ఉద్యానవనం – ఎఫ్‌ఎస్‌టీపీ) సేవలు ప్రారంభమయ్యాయి. ట్రయల్‌ రన్‌ సక్సెస్‌ కావడంతో మున్సిపల్‌ ఛైర్మన్‌ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్‌ అంకుషావలి ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు పారిశుద్ధ్య శుద్ధి కేంద్రాన్ని సందర్శించి ట్రయల్‌రన్‌ను పరిశీలించారు. పట్టణంలో ప్రతీ ఒక్కరు మూడేళ్లు నిండిన మరుగుదొడ్లను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కాగా, జిల్లాలో ఇల్లెందు, పాల్వంచ మున్సిపాలిటీలకు రెండు యూనిట్లు మంజూరు కాగా ఇల్లెందు ప్లాంట్‌ పనులు పూర్తి చేసుకుని శుద్ధి ప్రారంభమైంది. 10 కేఎల్‌డీ సామర్థ్యం గల ఇల్లెందు ప్లాంట్‌కు రూ.80 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో మున్సిపల్‌ డంప్‌యార్డు వెనుక వైపున గల ఎకరం ఖాళీ స్థలంలో 'పారిశుద్ధ్య వనరుల ఉద్యానవనం'(ఎఫ్‌ఎస్‌టీపీ) ప్లాంట్‌ను చేపట్టారు. రెండు రోజులుగా 17 ట్రిప్పుల వ్యర్థాలను సేకరించి ట్రయల్‌రన్‌ చేశారు. శుద్ధి చేసి నీటిని, ఎరువును వేర్వేరుగా బయటకు పంపించింది. ఇప్పటికే పట్టణంలో రెండు వాహనాలకు అనుమతులు కూడా ఇచ్చారు. వ్యర్థాల నుంచి వచ్చిన ఎరువును, శుద్ధి చేసిన నీటిని పూలమొక్కలకు, ప్లాంటేషన్‌లకు తరలించేందుకు సిద్ధం చేశారు. ఇల్లెందులో స్వచ్ఛభారత్‌లో భాగంగా సుమారు 10 వేల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించారు. ప్రతీ ఇంట్లోని సెప్టిక్‌ట్యాంక్‌ను మూడేళ్లకోసారి శుభ్రం చేయాల్సి ఉంది. ఏళ్లకుఏళ్లు మరుగుదొడ్లు శుభ్రం చేయకుండా ఉన్నవాటిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు.

స్వస్థలానికి చేరిన విద్యార్థి మృతదేహం



శివరామకృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సుభాష్‌చంద్రబోస్‌

ఖమ్మంరూరల్‌: అమెరికాలో మెడిసిన్‌ చదువుతూ ఈనెల 18న మృతి చెందిన ఖమ్మం రూరల్‌ మండలం సాయిప్రభాత్‌నగర్‌కు చెందిన హేమంత్‌ శివరామకృష్ణ(20) మృతదేహం శుక్రవారం ఇక్కడకు చేరింది. ఖమ్మం ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్‌ఐ టి.రవికుమార్‌ కుమారుడు శివరాకృష్ణ అమెరికాలోని బార్‌ బోర్స్‌లో మెడిసిన్‌ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల18న ఆయనకు గుండెపోటు రావడంతో స్నేహితులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో అక్కడి భారతీయుల, అధికారుల సహకారంతో ఏర్పాట్లు చేయగా మృతదేశం శుక్రవారం ఖమ్మంకు చేరింది. ఈమేరకు అడిషనల్‌ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు రామోజీ రమేష్, ప్రసన్నకుమార్‌ తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

భద్రాచలంలో కరకట్ట నిర్మించాలి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌ రావు

భద్రాచలంఅర్బన్‌/అశ్వారావుపేటరూరల్‌: గోదావరికి ఇరువైపులా కరకట్టలు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌ రావు కోరారు. శుక్రవారం భద్రాచలం, అశ్వారావుపేటలలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు ముంపు నుంచి భద్రాచలం పట్టణాన్ని కాపాడేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ వర్తింపజేయాలన్నారు. బీజేపీ విధానాలను వ్యతిరేకించే రాజకీయ పార్టీలతో తాత్కాలికంగా కలిసి పని చేయాలనే నిర్ణయాన్ని తీసుకున్నట్లు చెప్పారు. మే 3, 4,5వ తేదీల్లో భద్రాచలంలో జరిగే ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్‌ మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు కారం పుల్లయ్య, కొక్కెరపాటి పుల్లయ్య, ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి, ఎం.రేణుక, సున్నం గంగా, బండారు శరత్‌బాబు, బి.వెంకటరెడ్డి, వై.వెంకట రామారావు, పి.సంతోష్‌కుమార్, ఎస్‌.లీలావతి, పిట్టల అర్జున్, బీ చిరంజీవి, గడ్డం సత్యనారాయణ, మడిపల్లి వెంకటేశ్వరరావు, తగరం జగన్నాథం, అప్పారావు, గంగరాజు, తగరం నిర్మల పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

బూర్గంపాడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పేర్కొన్నారు. శుక్రవారం బూర్గంపాడులో జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మతోన్మాద విధానాలతో ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతోందని అన్నారు. 5న భద్రాచలంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు ఎంబీ నర్సారెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, కందుకూరి నాగేశ్వరరావు, యల్లంకి అప్పారావు, బర్ల తిరుపతయ్య, కొమర్రాజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న ఊసిరెడ్డి

నేలకొండపల్లి: జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ఎదిగేలా ప్రోత్సహించనున్నట్లు తెలంగాణ కబడ్డీ అసోసియేషన్‌ రాష్ట్ర కార్యదర్శి ఊసిరెడ్డి తెలిపారు. నేలకొండపల్లి మండలం మోటాపురంలో వీరన్నస్వామి జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళా కబడ్డీ పోటీలను శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలను పూర్వ వైభవం తీసుకునేలా పోటీలు నిర్వహిసస్తామని తెలిపారు. కాగా, తొలిరోజు తూర్పుగోదావరి, వైజాగ్‌ జట్ల మధ్య మ్యాచ్‌ జరిగింది. అడిషనల్‌ డీసీపీ సుభాష్‌ చంద్రబోస్, ఏపీ కబడ్డీ అసోసియేషన్‌ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, జిల్లా చైర్మన్‌ నల్లమల్ల వెంకటేశ్వరరావు, ఏసీపీ బస్వారెడ్డి, సర్పంచ్‌లు రాంబాయి, దండా పుల్లయ్యతో పాటు చావా కోటయ్య, బాగం హన్మంతరావు, రావెళ్ల కృష్ణారావు, భాగం హేమంతరావు, నున్నా రవికుమార్, ఇంటూరి అశోక్‌ పాల్గొన్నారు.

కత్తితో దాడి.. కేసు నమోదు

సుజాతనగర్‌: అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి కత్తితో దాడికి పాల్పడిన ఓ వ్యక్తిపై సుజాతనగర్‌ ఠాణాలో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ పి.తిరుపతిరావు కథనం మేరకు.. సర్వారం గ్రామ పంచాయతీ, హలావత్‌తండాకు చెందిన ఇస్లావత్‌ రాములు ఈ నెల 26న కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. రాత్రి 12 గంటల సమయంలో బానోత్‌ సక్కులాల్‌.. రాములు ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి నిద్రలో ఉన్న రాములుపై కత్తితో దాడి చేశాడు. రాములుతో పాటు అతని కుమారుడు రాజ్‌కుమార్‌పై సైతం దాడికి పాల్పడి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

సుజాతనగర్‌: తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని దుండగులు బంగారు ఆభరణాలతో పాటు నగదు అపహరించారు. ఈ ఘటనపై సుజాతనగర్‌ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని వేపలగడ్డ గాయత్రీనగర్‌కు చెందిన ప్రైవేట్‌ ఉద్యోగి పాలకుర్తి శ్రీనివాసరావు తన భార్య అనారోగ్యానికి గురవ్వడంతో ఈ నెల 26న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌ వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి చేరుకునే సరికి మెయిన్‌ డోర్‌ పక్కన గల కిటికీ చువ్వలు వంగి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లోని బట్టలు, సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. టేబుల్‌ డెస్క్‌లోని సుమారు రూ.లక్షకు పైగా విలువగల బంగారు ఆభరణాలు, రెండు జతల వెండి పట్టీలతో పాటు రూ.10 వేలు నగదుకు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.తిరుపతిరావు తెలిపారు.

దాడి ఘటనలో అట్రాసిటీ కేసు నమోదు

బోనకల్‌: ఏపీలోని ఎన్టీఆర్‌ జిల్లా చిట్యాలకు చెందిన కొదుముల శ్రీకాంత్‌ ఈనెల 25న బోనకల్‌లో మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. ఆయనపై కొందరు దాడి చేయగా వారిపై అట్రాసిటీ కేసు నమోదైంది. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ రెహమాన్‌ విచారణ చేపట్టి వివరాలను వెల్లడించారు. బోనకల్‌కు చెందిన మరీదు శివకృష్ణ షాపు వద్దకు కొదుముల శ్రీకాంత్, తదితరులు వచ్చినా ఆయనతో ఉన్న వారు కాసేపటికి వెళ్లిపోయారు. శివకృష్ణ, శ్రీకాంత్‌ ఘర్షణ పడగా శ్రీకాంత్‌ సీసాతో శివకృష్ణ తల పగులకొట్టాడు. స్థానికులు శ్రీకాంత్‌ను స్తంభానికి కట్టేసి కొట్టారు. బాధితుడి సోదరుడు ఫిర్యాదుతో మరీదు శివకృష్ణ, మొర్ల వెంకటేశ్వర్లు, మొర్ల మురళి, బొబ్బిళ్ల నర్సింహారావు, వంగాల నాగేశ్వరరావు, బాదావత్‌ రమేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. వీడియో ఫుటేజీ ఆధారంగా మిగిలిన వారిని గుర్తిస్తామని చెప్పారు. కాగా, శ్రీకాంత్‌పై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్న డిమాండ్‌తో పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ఎమ్మార్పీఎస్‌ నాయకులు ధర్నా చేశారు. నాయకులు ఏపూరి వెంకటేశ్వరావు, మందా వెంకటేశ్వరావు మాట్లాడుతూ శ్రీకాంత్‌పై విచక్షణారహితంగా దాడి చేయడంతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని తెలిపారు. కార్యక్రమంలో కోట దానేలు, కూరపాటి సునీల్, దావీదు, ఇరుగు జ్ఞానేష్, మందా అశోక్, తాటికొండ వెంకటరత్నం పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ముదిగొండ: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ నరేశ్‌ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని గోకినేపల్లికి చెందిన పయ్యావుల వినోద్‌కు సూర్యాపేట జిల్లా చింతలపాడు మండలం శోభనాద్రిగూడెంకు చెందిన మౌనిక(22)తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నాళ్లుగా ఇంట్లో గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన ఆమె శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఘటనపై ఆమె బాబాయి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, మౌనికకు 11 నెలల కుమారుడు ఉన్నాడు.

మనస్తాపంతో యువకుడు..

ముదిగొండ: భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో ముదిగొండకు చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ముదిగొండ ఎస్సీ కాలనీకి చెందిన బొడ్డు నవీన్‌(25) భార్య రెండేళ్ల నుంచి కాపురానికి రాకపోవడంతో మస్థాపానికి గురైనట్లు తెలిసింది. దీంతో ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. అయితే, ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేష్‌ తెలిపారు.

ధాన్యం దిగుమతిలో నిర్లక్ష్యంపై ఆగ్రహం

తల్లాడలో రైతుల రాస్తారోకో, ధాన్యానికి నిప్పు



ధాన్యానికి నిప్పుపెట్టి నిరసన తెలుపుతున్న రైతులు

తల్లాడ: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తే తరుగు తీయించడమే కాక క్వింటా రూ.1,600 కే విక్రయించాలని ఆంక్షలు పెడుతుండడంతో రైతులు మండిపడ్డారు. ఈమేరకు తల్లాడలో శుక్రవారం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేయడమే కాక ధాన్యానికి నిప్పుడు పెట్టి నిరసన తెలిపారు. తల్లాడ సొసైటీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కేంద్రంలో కాంటా వేశాక రైతులే ట్రాక్టర్లలో మిల్లుకు తీసుకెళ్లగా మూడు నుంచి ఆరు కిలోలు తరుగుకు ఒప్పుకోవాలని మిల్లర్లు స్పష్టం చేశారు. లేకపోతే క్వింటాకు ఉన్న మద్దతు ధర రూ.2,040కు బదులు రూ.1,600కే ఇవ్వాలని సూచించారు. దీంతో రైతులు సాయంత్రం వరకు వేచి ఉన్నా ఫలితం లేకపోవడంతో తల్లాడ, గొల్లగూడెం, కిష్టాపురం తదితర గ్రామాల రైతులు రాస్తారోకోకు దిగారు. వీరికి అఖిలపక్షం నాయకులు మద్దతు తెలపడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఈమేరకు తహసీల్దార్‌ గంటా శ్రీలత, తల్లాడ ఎస్‌ఐ సురేష్‌ చేరుకుని మిల్లర్లతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో రాస్తారోకో విరమించారు. ఆతర్వాత తహసీల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో తహసీల్దార్‌ మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని స్పష్టం చేశారు. డీటీ రామచంద్రరావుతో పాటు నాయకులు కాపా సుధాకర్, దుండేటి వీరారెడ్డి, కూచిపూడి వెంకటేశ్వర్లు, షేక్‌ లాల్‌మియా, దగ్గుల నాగిరెడ్డి, గుండ్ల వెంకటేశ్వర్లు, కాపా మహేష్, కోడూరి రాము, రైతులు పాల్గొన్నారు.

వచ్చేనెల 7న తలసేమియా డే

'సంకల్ప'అధ్యక్షుడు, రేడియాలజిస్ట్‌ రాజేశ్‌ గార్గే



చిన్నారులకు మందులు అందజేస్తున్న వైద్యులు

ఖమ్మంవైద్యవిభాగం: తలసేమియా బాధిత చిన్నారులకు రక్తం ఎక్కించడమే కాక వైద్యుల సలహాల మేరకు క్రమం తప్పకుండా మందులు వేయాలని సంకల్ప వలంటరీ ఆర్గనైజేషన్‌ అధ్యక్షుడు, ప్రముఖ రేడియాలజిస్ట్‌ డాక్టర్‌ రాజేశ్‌ గార్గే సూచించారు. ఖమ్మం రితన్య ఆస్పత్రిలోని తలసేమియా డేకేర్‌ సెంటర్‌లో సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం తలసేమియా బాధిత చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్‌ గార్గే మాట్లాడుతూ 14 ఏళ్లుగా తమ సంస్థ ద్వారా వైద్యశిబిరాలు, మందుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వచ్చేనెల 7న తలసేమియా డే నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా చిన్నారులకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు హెచ్‌ఎల్‌ఏ పరీక్షలు, బోన్‌ మ్యారో వైద్యంపై అవగాహన సదస్సు ఉంటుందని చెప్పారు. సమావేశంలో వైద్యులు డి.నారాయణ మూర్తి, సంస్థ బాధ్యులు పి.పావని, పి.రవిచందర్, పి.ఉదయ్‌భాస్కర్, ఎస్‌.ఉపేందర్, ప్రసాద్, డి.రాములు, కృష్ణ, సైదులు, తిరుపతి పాల్గొన్నారు.



టెస్టుల్లో శ్రీలంక 'సెంచరీ' విజయం

బౌలర్లు రమేశ్ మెండిస్ (5/64), ప్రభాత్ జయసూర్య (2/88), అసిథా ఫెర్నాండో (3/30) రాణించడంతో... ఐర్లాండ్‌తో గాలెలో జరిగిన రెండో టెస్టులో శ్రీలంక ఇన్నింగ్స్ 10 పరుగుల తేడాతో గెలిచింది. దాంతో కరుణరత్నే కెప్టెన్సీలోని శ్రీలంక రెండు టెస్టుల సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. 1982లో టెస్ట్ హోదా పొందిన శ్రీలంక జట్టుకిది 100వ టెస్టు విజయం కావడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 54/2తో ఆట చివరిరోజు శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ 77.3 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది.

సెమీఫైనల్లో సుమిత్ నగాల్



రోమా గార్డెన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ప్లేయర్ సుమిత్ నగాల్ వరుసగా మూడో విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. రోమ్‌లో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సుమిత్ 7–5, 6–0తో మాక్స్ హూక్స్ (నెదర్లాండ్స్)పై గెలుపొందాడు. 87 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు.

సాత్విక్–చిరాగ్ జోడీకి పతకం ఖాయం

సింధు, ప్రణయ్‌లకు నిరాశ



దుబాయ్: ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఒక పతకం ఖాయమైంది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–11, 21–12తో అహ్సాన్–హెంద్రా సెతియవాన్ (ఇండోనేసియా) జోడీని ఓడించింది. ఈ గెలుపుతో సాత్విక్–చిరాగ్ 1978 తర్వాత ఆసియా చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో ఫైనల్ చేరిన, పతకాన్ని ఖరారు చేసుకున్న భారతీయ జోడీగా గుర్తింపు పొందింది. 1978లో ప్రకాశ్ పదుకొనే–సయ్యద్ మోడీ జోడీ భారత్‌కు రజత పతకం అందించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ పీవీ సింధు 21–18, 5–21, 9–21తో ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. కాంటా సునెయామ (జపాన్)తో జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి గేమ్‌ను 11–21తో కోల్పోయి, రెండో గేమ్‌లో 9–13తో వెనుకబడిన దశలో గాయంతో వైదొలిగాడు. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) జోడీ 18–21, 21–19, 15–21తో దెజాన్–గ్లోరియా విడ్‌జాజా (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది.

రన్నరప్ కార్తీక్ వెంకటరామన్



చెన్నై: సన్‌వే ఫార్మెన్‌టెరా అంతర్జాతీయ చెస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ రన్నరప్‌గా నిలిచాడు. స్పెయిన్‌లో ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత 10 రౌండ్ల తర్వాత ఫెదోసీవ్ వ్లాదిమిర్ (రష్యా), కార్తీక్ వెంకటరామన్ (భారత్), ప్రణవ్ (భారత్), లియోన్ ల్యూక్ మెండోకా (భారత్) ఏడు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. విజేతను నిర్ణయించేందుకు ఈ నలుగురి మధ్య ప్లే ఆఫ్ గేమ్‌లను నిర్వహించారు. వ్లాదిమిర్, కార్తీక్ ఫైనల్ చేరగా.. ఫైనల్లో కార్తీక్‌పై నెగ్గి వ్లాదిమిర్ విజేతగా నిలిచాడు.

లక్నో పరుగుల సునామీ

- మేయర్స్, స్టొయినిస్, బదోని, పూరన్ మెరుపులు
- 56 పరుగులతో పంజాబ్‌పై జయభేరి



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్

మొహాలీ: వారంకిందట గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో చేతిలో బోలెడు వికెట్లున్నా తక్కువ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది లక్నో సూపర్ జెయింట్స్. ఇప్పుడిదే జట్టు పంజాబ్ కింగ్స్‌పై పరుగుల పంజా వేసింది. ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు చేసి మరీ 56 పరుగులతో ఘనవిజయం సాధించింది. మొదట లక్నో 20 ఓవర్లలో 5 వికెట్లకు 257 పరుగుల భారీస్కోరు చేసింది. స్టొయినిస్ (40 బంతుల్లో 72; 6 ఫోర్లు, 5 సిక్సర్లు), మేయర్స్ (24 బంతుల్లో 54; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), పూరన్ (19 బంతుల్లో 45; 7 ఫోర్లు, 1 సిక్స్), బదోని (24 బంతుల్లో 43; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగారు. తర్వాత పంజాబ్ 19.5 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటైంది. అథర్వ (36 బంతుల్లో 66; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు.

దంచుడే... దంచుడే...

మేయర్స్ రెండో ఓవర్లో పెట్టిన ధనాధన్ ముహూర్తం తర్వాత వచ్చిన వారంతా దంచేసేలా చేసింది. రాహుల్ (12) నిరాశపరచగా... గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్, రజా, రబడలు వేసిన పవర్‌ప్లేలో మేయర్స్ 'నాటు నాటు' కొట్టుడుతో 20 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. ఇంకో ఫోర్ కొట్టి జోరుమీదున్న అతన్ని రబడ బోల్తా కొట్టించాడు. కానీ పవర్‌ప్లేలో లక్నో 74/2 స్కోరు చేసింది. ఓపెనర్ల ఆట ముగిసినా... దూకుడైతే ఎంతకీ ఆగలేదు. బదోని, స్టొయినిస్‌ల బ్యాట్లు కూడా భారీ షాట్లపైనే గురి పెట్టడంతో 7.4 ఓవర్లలోనే స్కోరు 100 దాటింది. గుర్నూర్ వేసిన ఆ ఎనిమిదో ఓవర్లో ఇద్దరు చెరో 6, 4లతో 24 పరుగులు పిండారు. ఆటలోనే హైలైట్స్ చూపెట్టడంతో 10 ఓవర్లలో లక్నో 128/2 స్కోరు చేసింది. కాసేపటికి 6 కొట్టిన బదోని మరుసటి బంతికి అవుటైతే... తర్వాత వచ్చిన పూరన్ హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. ఇలా ఆకాశమే హద్దుగా సాగిన లక్నో స్కోరు 15.5 ఓవర్లలోనే 200 పరుగులు దాటింది. స్టొయినిస్ 31 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. డెత్ ఓవర్లలో స్టొయినిస్, పూరన్ అవుట్ కావడంతో ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు నమోదైంది. లేదంటే స్కోరు చరిత్ర మారేది! 2013లో పుణే జట్టుపై బెంగళూరు 263 పరుగులు చేసింది.

200 పైచిలుకు తీసుకొచ్చినా...

ధావన్ (1), ప్రభ్‌సిమ్రన్ (9) నిరాశపరిచినప్పటికీ అథర్వ, రజా (22 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్) జట్టు స్కోరును 100 దాటించారు. ఆ తర్వాత లివింగ్‌స్టోన్ (23; 2 ఫోర్లు, 1 సిక్స్), జితేశ్ (24; 3 సిక్స్‌లు), స్యామ్ కరన్ (11 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) షారుఖ్ (బి) రబడ 12; మేయర్స్ (సి) ధావన్ (బి) రబడ 54; బదోని (సి) చహర్ (బి) లివింగ్‌స్టోన్ 43; స్టొయినిస్ (సి) జితేశ్ (బి) కరన్ 72; పూరన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 45; హుడా (నాటౌట్) 11; కృనాల్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 257. వికెట్ల పతనం:** 1–41, 2–74, 3–163, 4–239, 5–251. **బౌలింగ్:** గుర్నూర్ 3–0–42–0, అర్ష్‌దీప్ 4–0–54–1, రబడ 4–0–52–2, రజా 1–0–17–0, చహర్ 4–0–29–0, స్యామ్ కరన్ 3–0–38–1, లివింగ్‌స్టోన్ 1–0–19–1.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (సి) సబ్–సామ్స్ (బి) నవీనుల్ 9; ధావన్ (సి) కృనాల్ (బి) స్టొయినిస్ 1; అథర్వ (సి అండ్ బి) బిష్ణోయ్ 66; రజా (సి) కృనాల్ (బి) యశ్ 36; లివింగ్‌స్టోన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బిష్ణోయ్ 23; స్యామ్ కరన్ (సి) బదోని (బి) నవీనుల్ 21; జితేశ్ (సి) రాహుల్ (బి) యశ్ 24; షారుఖ్ (సి) బిష్ణోయ్ (బి) యశ్ 6, చహర్ (సి) హుడా (బి) యశ్ 0; రబడ (బి) నవీనుల్ 0; అర్ష్‌దీప్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 201. వికెట్ల పతనం:** 1–3, 2–31, 3–109, 4–127, 5–152, 6–178, 7–192, 8–193, 9–197, 10–201. **బౌలింగ్:** స్టొయినిస్ 1.5–0–21–1, మేయర్స్ 1–0–4–0, బదోని 0.1–0–0–0, నవీనుల్ 4–0–30–3, అవేశ్ 2–0–28–0, మిశ్రా 2–0–23–0, బిష్ణోయ్ 4–0–41–2, యశ్ 3.5–0–37–4, కృనాల్ 1–0–13–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	8	5	3	10	0.939
లక్నో	8	5	3	10	0.841
గుజరాత్	7	5	2	10	0.580
చెన్నై	8	5	3	10	0.376
బెంగళూరు	8	4	4	8	-0.139
పంజాబ్	8	4	4	8	-0.510
కోల్‌కతా	8	3	5	6	-0.027
ముంబై	7	3	4	6	-0.620
హైదరాబాద్	7	2	5	4	-0.725
ఢిల్లీ	7	2	5	4	-0.961

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా x గుజరాత్ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
ఢిల్లీ x హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

బ్రిజ్‌భూషణ్‌పై 'ఎఫ్‌ఐఆర్' నమోదు

- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఢిల్లీ పోలీసుల చర్య
- కొనసాగుతున్న రెజ్లర్ల నిరసన



"సుప్రీం కోర్టు ఆదేశాలను నేను స్వాగతిస్తున్నా. ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం నాకూ మంచిదే. విచారణలో వారికి అన్ని విధాలా సహకరిస్తా. విచారణ కమిటీలు ఏర్పాటు చేసినప్పుడు కూడా నేను ప్రశ్నించలేదు. రెజ్లర్లు మరికొంత సమయం ఆగాల్సింది. కానీ వారు కోర్టుకు వెళ్లారు. ఎవరి పట్లా తప్పుగా వ్యవహరించలేదు. నాకు నాపై నమ్మకముంది.
–బ్రిజ్‌భూషణ్ సింగ్

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి ఎట్టకేలకు ఢిల్లీ పోలీసులు స్పందించారు. శుక్రవారం సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా బ్రిజ్‌భూషణ్‌పై 'ఎఫ్‌ఐఆర్' నమోదు చేస్తామని ఇచ్చిన హామీని పూర్తి చేశారు. బ్రిజ్‌భూషణ్‌పై కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. మైనర్ రెజ్లర్ చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుంటూ 'పోక్సో యాక్ట్' ప్రకారం ఒక ఎఫ్‌ఐఆర్... ఇతర రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ప్రకారం మరో ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేశారు. రెండింటిపై సత్వర విచారణ చేపడతామని పోలీసులు చెప్పారు. ఈ అంశంపై మే 5న మరోసారి విచారిస్తామని, ఆలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిరసన చేస్తున్న రెజ్లర్లు, ఫిర్యాదు చేసిన వారి జాబితాలో ఉన్న ఒక మైనర్ రెజ్లర్ భద్రతకు సంబంధించి కూడా ఢిల్లీ పోలీసులు బాధ్యత తీసుకోవాలని కూడా సుప్రీం సూచించింది. 'మైనర్ రెజ్లర్‌కు ఉన్న ముప్పును దృష్టిలో పెట్టుకుంటూ తగినంత భద్రత కల్పించాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ఆదేశిస్తున్నాం. ఇతర రెజ్లర భద్రతను కూడా ఆయన సమీక్షించాలి. దర్యాప్తునకు సంబంధించిన డాక్యుమెంట్ల విషయంపై గోప్యత కూడా పాటించాలి' అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడా బెంచీ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు బజరంగ్, వినేశ్, సాక్షి తదితర రెజ్లర్లు జంతర్‌మంతర్ వద్ద తమ నిరసన కొనసాగిస్తున్నారు. బ్రిజ్‌భూషణ్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులు నిర్ణయించడం పట్ల రెజ్లర్లు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఎఫ్‌ఐఆర్ మాత్రమే కాదు, బ్రిజ్‌భూషణ్ అరెస్ట్ అయ్యే వరకు ఇది కొనసాగుతుందని బజరంగ్ స్పష్టం చేశాడు. 'విజయం దిశగా ఇది మొదటి అడుగు మాత్రమే. అయితే మా నిరసన ఇకపైనా కొనసాగుతుంది. ఆయనను అన్ని పదవుల నుంచి తప్పించడంతో పాటు జైలుకు పంపాల్సిందే. లేదంటే విచారణను ప్రభావితం చేస్తాడు' అని రెజ్లర్ సాక్షి మలిక్ పేర్కొంది.



వినేశ్ ఫొగాట్, సంగీత ఫొగాట్, సాక్షి

'కరెంట్ కట్'



'ఢిల్లీ పోలీసులు మా పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు. ఎఫ్‌ఐఆర్ నమోదైంది కాబట్టి నిరసన ముగించమని ఒత్తిడి తెస్తున్నారు. కరెంట్ కట్ చేసి గేట్లు మూసేశారు. భోజనం, నీళ్లు కూడా లోపలికి రానివ్వడం లేదు. నేను ఏసీపీతో మాట్లాడాను. ఏం చేస్తారో చేసుకోండి అని ఆయన జవాబిచ్చాడు. వారు ఏం చేసినా మా ఆందోళన కొనసాగిస్తాం. మీ ఇంటి ఆడపిల్లలైతే ఇలాగే చేస్తారా. బ్రిజ్‌భూషణ్ చట్టంకంటే పెద్దవాడిగా మారిపోయాడు' (అర్ధరాత్రి 12 గంటలకు పరిస్థితి).

చిన్నారులకు సమ్మర్ కేర్!



ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే వేసవి సెలవులు మొదలయ్యాయి. ఇక పిల్లల ఆటలు, పాటలు అంటూ ఎక్కువ సేపు బయటే తిరుగుతూ ఉంటారు. తిండీ, నిద్రనూ కూడా నిర్లక్ష్యం చేసి మరీ ఆటల్లో మునిగిపోతారు. సమ్మర్‌లో చిన్నపిల్లలను నిర్లక్ష్యం చేస్తే త్వరగా డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే వడదెబ్బ, చర్మ సమస్యలతో సహా మరెన్నో అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. అందుకే వాళ్లను ఈ కాలంలో మరింత జాగ్రత్తగా చూసుకోవాలి.

మసాలాలు, జంక్ ఫుడ్ జోలికి వెళ్లవద్దు..

వేసవిలో కారం, మసాలా, వేపుళ్లు, స్వీట్లు వంటి వాటికి దూరంగా ఉంచాలి. కారం, మసాలాలు తింటే మరింత వేడి చేసే ప్రమాదం ఉంది. పిజ్జా, బర్గర్, అలాగే నిల్వ ఆహారాన్ని ఇవ్వకూడదు. ఇవన్నీ దాహాన్ని మరింత పెంచుతాయి. ఎక్కువగా ఇంట్లో తాజాగా వండిన ఆహారాన్నే తీసుకునేలా చూడాలి. అలాగే లేస్, కుర్కురేలు వంటివి అసలు మంచిది కాదు. వీలయినంత వరకు ఇంట్లో వండిన చిరుతిళ్లే అలవాటు చేయాలి.

మధ్యాన్నం పూట బయటకు పంప వద్దు

వేసవిలో పిల్లలు ఎక్కువగా ఆటలు ఆడుకోవడానికి.. బయటకు వెళ్లిపోతారు. అయితే మధ్యాహ్న సమయం లో మాత్రం పిల్లలను బయటకు అనుమతించవద్దు. ఆ సమయంలో ఎండ ఎక్కువగా ఉంటుంది, రేడియేషన్ కూడా ఎక్కువగా ఉంటుంది. బయట వాతావరణం చాలా వేడిగా ఉండడం వల్ల పిల్లల శరీర ఉష్ణోగ్రత పెరిగి.. చెమట ఎక్కువగా పడుతుంది. ఒంట్లో నీరు వేగంగా ఆవిరై... డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఇవి వడదెబ్బకు దారితీస్తాయి. ఉదయం, సాయంత్రం ఎండలేని సమయాల్లోనే పిల్లలను బయటకు అనుమతించాలి.

ఏం చేయాలి మరి?

మధ్యాహ్న సమయంలో పిల్లలకి కథలు చెప్తూ, పుస్తకాలు చదివిస్తూ, బొమ్మలు వేయిస్తూ, ఇంట్లో ఆడుకునే ఆటలు ఆడుకునేలా చూడాలి. పజిల్స్ ఇవ్వడం, అంత్యాక్షరి, వర్డ్ బిల్డింగ్ వంటివి ఆడించాలి. వారికి ఆసక్తి ఉన్న అంశంపై మరింత ఎక్కువ ఏకాగ్రత చూపేలా లేదా రాని సబ్జెక్టును నేర్చుకునేలా చేయాలి.

సౌకర్యంగా ఉండే దుస్తులు

బయటి వాతావరణం వేడిగా ఉన్నప్పుడు చిన్నారులకు తేలికైన, కాటన్ వస్త్రాలను వేయాలి. ఇవి సింథటిక్, ఇతర ఫ్యాబ్రిక్స్ కంటే చెమటను ఎక్కువగా పీల్చేసుకుంటాయి కాబట్టి బేవజాలకు పోకుండా పిల్లలకు లేత రంగులలో ఉండే కాటన్ దుస్తులను వేయడం ఉత్తమం. అలాగే రెండుపూటలా స్నానం చేయించడం మంచిది. బయట ఆటలాడి వచ్చినా, ఇంట్లోనే ఉన్నా కూడా పిల్లలకు చెమట పడుతుంది. అలాగే వదిలేస్తే అలర్జీలు వస్తాయి. అందువల్ల గోరువెచ్చటి నీటితో రెండుపూటలా స్నానం చేయించాలి.

పండంటి ఆరోగ్యం కోసం..

సాధారణంగా వేసవిలో పిల్లల చర్మం పొడిబారి, దురద, మంట వంటి పలురకాల ఎలర్జీలు మొదలవుతుంటాయి. అటువంటి లక్షణాలు కనిపించినప్పుడు వారు డీహైడ్రేషన్‌కు గురైనట్లు గుర్తించాలి. యూరిన్‌కు అతి తక్కువగా వెళ్లడం, కడుపునొప్పి, తలనొప్పి, వికారంగా ఉన్నా.. జాగ్రత్తగా గమనించాలి. మామిడి, ద్రాక్ష, పైనాపిల్, పుచ్చ, కమలాజ్యూస్‌లు పట్టించాలి. రోజూ ఉదయం గ్లాసు కొబ్బరినీళ్లు ఇవ్వాలి. ఇందులోని పొటాషియం వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది. పిల్లలతో రోజుకి కనీసం రెండు లీటర్ల నీటిని తాగించడం అన్నింటికన్నా ముఖ్యం. సబ్జానీళ్లు ఇస్తే మరీ మంచిది.

చల్లటి పదార్థాలు ఇవ్వద్దు

వేసవిలో తాపం ఎక్కువగా ఉండటం సహజం. చల్లటివి ఏమైనా తినాలని, తాగాలనీ అనిపిస్తుంది. అలాగని ఫ్రిజ్‌లో పెట్టి.. తీసిన వెంటనే తిన్నా అవి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. పిల్లలు ఫ్రిజ్ నీళ్లు తాగితే.. జలుబు చేసే అవకాశం ఉంది. దానికన్నా కుండ నీళ్లు తాగించడం చాలా మంచిది.

మజ్జిగ ఇవ్వండి

మధ్యాహ్నం భోజనం తర్వాత పలుచటి మజ్జిగలో చిటికెడు జీలకర్ర పొడి, ఉప్పు, పావుచెక్క నిమ్మరసం కలిపి తాగిస్తే జీర్ణశక్తి మెరుగ్గా ఉంటుంది. మజ్జిగలో కాల్షియం, విటమిన్ బి 12, పొటాషియం అందుతాయి. ఇవి తలనొప్పి, వికారం వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని స్తాయి. క్యారెట్, కీరదోస ముక్కలపై కాస్త నిమ్మ రసం, చిటికెడు ఉప్పు చల్లి తినిపించడం మంచిది. ముఖ్యంగా డీ హైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలి.

సన్‌స్క్రీన్

మీ పిల్లలు బయటకు వెళ్లేప్పుడు.. అతిగా ఎక్స్‌పోజ్ అయ్యే భాగాలకు సన్‌స్క్రీన్ లోషన్ రాయడం మంచిది. సన్‌స్క్రీన్ పిల్లలను వడదెబ్బ, రాషెస్ నుంచి రక్షిస్తుంది. మీ పిల్లలు బయట ఉండే సమయం బట్టి.. సన్‌స్క్రీన్ రెండు సార్లు రాసినా పర్వాలేదు.

వేసవి ఫ్లూ

5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఏడాది పొడవునా ఈ సమస్యలు తరచుగా వస్తాయి. కాబట్టి వారిని ఎండలో తిరగనీయకుండా ఉంచాలి. సాయంత్రం వేళ లేదా ఉదయం పూట వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఆడుకోవడానికి అనుమతివ్వండి. వారికి సరైన పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచవచ్చు.

కీటకాల బెడద

ఎండాకాలంలో దోమలు చిరాకు పుట్టిస్తాయి. దోమలే కాకుండా ఇతర కీటకాల కాటుకు పిల్లలు గురయ్యే అవకాశం ఉంది. ప్రభావిత ప్రాంతంలో దురద, వాపు వస్తాయి కాబట్టి వైద్యుల సూచన మేరకు పిల్లల కోసం ప్రత్యేకమైన దోమల నివారణ మందులను వాడేందుకు ప్రయత్నించండి.

ఈతకు వెళుతుంటే...

చెరువులు.. బావులకు సరదాగా ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలి. కొంత మంది పాత బావుల్లో కూడ ఈతకు వెళతారు. ఇలాంటి సమయంలో కొన్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలు ఈత కొట్టే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు రోజంతా బయట ఆడుకుంటారు, ఈ సమయంలో వారు తినడం, తాగడం మర్చిపోతారు. అటువంటి పరిస్థితిలో, వారి ఆహారంపై మరింత శ్రద్ధ వహించడం మంచిది,

కూలింగ్ గ్లాసెస్

మీ పిల్లలు ఎండల్లో బయటకు వచ్చినప్పుడల్లా.. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకునేలా చూడండి. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుంటే.. సూర్యుని కిరణాలు డైరెక్ట్‌గా కళ్లల్లో పడవు. కళ్లు సేఫ్‌గా ఉంటాయి. కుదిరితే.. క్యాప్ పెట్టుకుంటే ఇంకా మంచిది.. ఎండ డైరెక్ట్‌గా వారి తల మీద పడదు. ఎండ తలమీద పడితే.. తలనొప్పి, వినుగు, కళ్లు తిరిగే అవకాశం ఉంటుంది. బయట నుంచి ఇంటికి వచ్చిన తర్వాత చల్లటి నీళ్లతో కళ్లు శుభ్రంగా కుడిగితే.. వారికి ప్రశాంతంగా ఉంటుంది.

మామిడిపళ్లు తినేముందు...



మామిడి పండ్లను తినేముందు వాటిని కనీసం ఒక గంట పాటు నీటిలో నానబెట్టాలని అమ్మమ్మలు, నానమ్మలు సలహా ఇస్తూ ఉంటారు. కారణం ఏమిటంటే, మామిడిపండ్లలో ఫైటిక్ ఆమ్లం ఉత్పత్తి అవుతుంటుంది. ఇలా అధికంగా ఉత్పత్తి అయ్యే ఈ యాసిడ్‌ను తొలగించడానికి నీళ్లలో నానబెట్టాలి. వివిధ కూరగాయలు, ధాన్యాలు, పప్పులు వంటి వాటిలో ఈ ఫైటికి యాసిడ్ ఉంటుంది. ఇలా నానబెట్టడం వల్ల అది విచ్ఛిన్నమైపోతుంది. ఈ ఫైటిక్ యాసిడ్ అదనపు వేడిని కూడా ఉత్పత్తి చేస్తుంది. నీటిలో నానడం వల్ల ఈ అదనపు వేడి తగ్గిపోతుంది.

టాక్సిన్లను తొలగిస్తుంది

మామిడి పండ్లను తినడానికి ముందు గంటపాటు నీళ్లలో నానబెట్టడం వల్ల వాటి తొక్కపై ఉండే కనిపించని నూనె తొలగిపోతుంది. అది కొందరిలో ఎలర్జీలు కలిగించే అవకాశం ఉంది. అలాగే పాలీఫెనాల్స్, టానిన్లు వంటి సూక్ష్మ పదార్థాల మిశ్రమం తొక్క పైన ఉండే అవకాశం ఉంది. అవి శరీరంలో చేరితే దురద, బొబ్బలు రావడానికి కారణం అవుతుంది. మామిడిపండ్లు నానబెట్టడం వల్ల అవన్నీ తొలగి పండు తినడానికి అనువుగా సురక్షితం గా మారుతుంది.

మామిడి పండ్లను ఇలా నీటిలో నానబెట్టడం వల్ల వాటి రుచి కూడా బాగుంటుంది. ప్రత్యేకించి ఆ పండ్లను ఫ్రిడ్జ్‌లో ఉంచినట్లయితే వాటిని కచ్చితంగా నీళ్ళల్లో నానబెట్టాలి. ఎందుకంటే ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఆ పండులో ఉండే కొన్ని సమ్మేళనాలు పండు వాసనను, రుచిని మార్చేస్తాయి. నీళ్లలో నానబెట్టడం వల్ల వాటి సహజమైన తీపి, సువాసనను తిరిగి పొందవచ్చు.

నులి పురుగుల నివారణకు...



పిల్లలు కొన్నిసార్లు ఎంత రుచిగా చేసి పెట్టినా సరే, ఆకలి కావడం లేదంటారు. తరచూ విరేచనాలు చేసుకుంటారు. బరువు తగ్గిపోయి బలహీనంగా కనిపిస్తుంటారు. ఎందుకు ఇలా అవుతోందో తెలియక తల్లిదండ్రులు ఆందోళన చెందుతారు. నిజానికి ఇవి ప్రమాదకరమైన వ్యాధి లక్షణాలేమీ కాదు. కడుపులో నులిపురుగులు ఉండటం వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయి. వాటిని ఎలా నివారించాలో తెలుసుకుందాం...

తినే ఆహారం పేగుల్లోకి చేరినప్పుడు రక్తంలోకి చేరాల్సిన పోషకాలను నులిపురుగులే పీల్చుకోవడంతో చిన్నారుల్లో ఎదుగుదల నిలిచిపోయి రోగాల బారిన పడుతారు. ఆకలి మందగించి ఒక్కోసారి ప్రాణాల మీదికి కూడా వస్తుంది.

కడుపులో నులి పురుగులు పోవడానికి...

- వేప నూనె పది చుక్కలు చక్కెరలోవేసి లోపలకు తీసుకుంటే క్రిములు నశిస్తాయి
- గుప్పెడు లేత వేప చిగురు, అర చెంచా ఉప్పు, అర చెంచా పసుపు కలిపి మాత్రల్లా చేసుకొని రాత్రి నిద్రించే ముందు ఒక మాత్ర వేసుకుంటే నులిపురుగులు నశిస్తాయి.
- పచ్చి బొప్పాయి కాయకు గాట్లు పెట్టగా వచ్చిన పాలు చెంచా, ఆముదం చెంచా కలిపి తాగితే. పురుగులు పడిపోతాయి.
- ఎండించిన వేప పువ్వు 50 గ్రాములు. మిరియాల పొడి చెంచా, ఉప్పు చెంచా కలిపి ప్రతిరోజు భోజనంలో మొదటి ముద్దగా కలుపుకుని తినాలి, లేదా గ్లాసు నీటిలో ఒక చెంచా వేసి సగం అయ్యే వరకు మరిగించి కషాయం లాగా తాగినా కూడా నులిపురుగులు నశిస్తాయి.
- వీటన్నింటినీ చేయడం కష్టం అనుకుంటే ఆల్బెండజాల్ ట్యాబ్లెట్‌ను పదిహేను రోజులకొకసారి చొప్పున నెలరోజులు వాడాలి. ఒక నెల గ్యాప్ ఇచ్చి అదే రిపీట్ చేయాలి.